# పరివర్తన

కథానిక

"ఆడుకుందాం రారా తమ్ముడూ" అంటూ సీత నాలుగేళ్ళ తమ్ముణ్ణి పెరట్లోకి తీసికెళ్ళింది. నుయ్యి, కొంచం దూరంలో దబ్బచెట్టు; రెండింటికీ మధ్యగా బండ రాయి. దానిమీద కూర్చుని మళ్ళీ పిలిచింది. "రారా తమ్ముడూ, ఆడుకుందాం నే నమ్మనిట, నువ్వు నాన్నవిట; నువ్వు కొడతావు, నే నేడుస్తాను."

"నే లాను. నే నావుకి గడ్డేత్తా" అని గడ్డి కోసం నుయ్యివేపు నడిచాడు బాబు.

పశువులసాల్లోంచి విన్న శాంత ఒళ్ళు మండిపోయింది. "నా జీవితం పిల్లకూడా ఆటే అయిపోయింది, మొండి వెధవ అచ్చా నాన్న పోలికే దెబ్బలు కూడా వాడిష్టమొస్తేకాని కొట్టడు" అని మోహన్ మీద తనకోపాన్ని వెళ్ళకక్కుతూ గద్దించింది పిల్లల్ని.

"నూద్దగ్గిరం చేస్తున్నారా మీరిద్దరూ? ఇంట్లోకి నడవండి" అని. అసలే పరాభవాగ్నితో ఒళ్లు మండిపోతూంది. పదేళ్లు సంసారం చేశాక మొదటిసారిగా నిన్న మోహన్ శాంతమీద చెయ్యి చేసుకున్నాడు.

"రారా తమ్ముడూ పోదాం" అంటూ తమ్ముడి చెయ్యి పట్టుకుంది సీత.

"నే లాను ఆవుకి గడ్డివేత్తా" అని ఈంద్ర పడుతూన్నవాణ్ణి పొట్టకానించుకుని లోపలికి తీసుకుపోయింది సీత.

అవమానంతో, అహంకారంతో, త్రాచు పాములా బుసకొడుతూన్నది శాంత మనస్సు. "ప్రతిక్రియ" అన్న శీర్షికకింద ఆత్మహత్య మొదలు అసహాయ సహాకరణోద్యమం వరకూ తీవ్రంగా చర్చచేసుకుంది మనస్సులో. "మోహన్‌ది తప్పు" అని ఋజువుచేయడానికి తగిన వాదం తయారుచేస్తూన్నది లోపల. కాని కనబడకుండా కారిపోతున్నది వాదనలో బలమంతా. అవమానంతో అహంకారంతోనన్నా శాంత మనస్సు, ఓటమికి ఒప్పుకోకుండా, మళ్ళా మళ్ళా డిఫెన్సు నిర్మించుకుంటూ వస్తున్నది.

పాపం శాంత జీవితం పదేళ్లనాటి చిత్రంలా తయారైంది. చిత్రకారుడు చవకబారురంగులతో "గాడీ"గా బొమ్మని చిత్రించాడు. పదేళ్లలో రోజురోజుకూ రంగులు వాటి కళని పోగొట్టుకున్నాయి. తెల్లగా ఉన్నవి నల్లగాను, జిగజిగ మెరుస్తున్నవి వెలవెలపోతూనూ మారాయి. దీనికి తోడు కీటకాలు, నిర్దాక్షిణ్యంగా తినేశాయి, అక్కడక్కడ ప్రతిరోజూ చూస్తున్నా యీ మార్పును గ్రహించలేరు సామాన్యంగా. కాని పదేళ్లు పోయాక మెరుపులా కనబడుతుంది మొదటి చిత్రం. చిత్రకారుడు ఒక అభిప్రాయంతో చిత్రిస్తే, పదేళ్ళతరువాత వ్యతిరేకార్థం కనపరుస్తున్నదీ చిత్రం.

"వంటకి మడికట్టుకోవాలి... కాని ఏమిటా తొందర? రాత్రి వండింది ఎవ్వరూ తినకపోతే అలాగే ఉంది. తెల్లారకుండానే దొంగలా "సీతీ! కేంపు వెడుతున్నా రాత్రిదాకా రానని మీ అమ్మతో చెప్పు" అని జఫాయించేశారు. పొద్దున్నే ఎదురుపడ్డానికి ధైర్యం ఎక్కడనుంచి వస్తుంది?" అని తన డిఫెన్సుకి మొదటు మెట్టువేసింది. కాని అంతర్వాహినిలో నిలపడలేదు. శాంతకి మోహన్ పిరికివాడుకాదని తెలుసు. యుద్ధంరోజుల్లో ప్రతివాడూ లంచానికి కక్కుర్తిపడ్డారు మోహన్ తప్ప. రేషన్ బియ్యం చాలక ఎక్కడోక్కడ నుంచి అదనంగా తీసుకొచ్చేవారు మోహన్ తప్ప. ఇల్లాంటివెన్నో ఉన్నాయి. పడకకుర్చీలో చేరబడింది. పరాభవాగ్నితో దహించుపోతున్న మనస్సువల్ల రాత్రంతా జాగరం చేసింది. కుర్చీమీద చేరపడగానే చిన్న నిద్దర్లావచ్చింది...

స్కూల్లో చదువుతూన్నప్పటి దృశ్యం. స్కూలుకెదురుగుండా చిన్నచిన్న దుకాణాలుండేవి. అందులో ఒకమధ్యవయస్కురాలైన

"గోపి"

యువతిదగ్గర మురిడీలు, బఠానీలు, వేరుశనక్కాయలు కొంటూండేది శాంత. ఆవేళ పెద్దవర్షం పడింది. ముడికెడునీరు రోడ్డుమీద ప్రవహిస్తూంటే బఠానీలకోసం బయలుదేరింది... ఇంతలోనే దృశ్యంమారింది. మధ్యవయస్సురాలైన యువతి బదులు శాంతే బఠాణీలకొట్టులో అమ్మడాని కూర్చుంది. బడిపిల్లలంతా చుట్టూచేరి తెగనవ్వి గోలచేస్తున్నారు. ముందున్న బుట్టలుచూస్తే వాట్లో ఏమీలేవు. శాంతకి వెంటనే అర్థమైంది. సరకులేకుండా అమ్మడానికూర్చునందుకు గోల చేస్తున్నారని. చాలాకోపం వచ్చింది. పిల్లల్ని పట్టుకుని కొడదామన్న ఉద్దేశంతో వాళ్ళమీద కురికింది. ఆ ఊపులో కుర్చీకి చెయ్యితగిలి మెలుకువ వచ్చింది. శాంతకి నవ్వొచ్చింది. బఠాణీలు మురిడీలులేకుండా అమ్మడానికూర్చొని నవ్వుతున్నారని పిల్లల్ని కొట్టడంలోని అవివేకాన్ని తల్చుకుంటే. కాని వెంటనే అర్థమైంది— "సరుకులేకుండా అమ్మడానికి చూస్తున్న విషయం" తన జీవితకథ సారాంశమేమోనని. "కొంచెం దగ్గరలో చూస్తే నేనేమీ జీవితానికి ఇవ్వకుండా, జీవితంనుండి సుఖాన్ని ఆశిస్తున్న స్వార్థపరురాలన్నమాట"... ఈ కొత్త అభిప్రాయం తన ,డిఫెన్సునంతా పాడుచేస్తున్నదని తెలుసు. కాని అకస్మాత్తుగా డబ్బుదొరికినట్టయింది ఈ ఆలోచన్ని మథించడంలో!

మోహన్‌ని దోషిగా భావించి, ఎట్లాగన్నా మార్చాలని ప్రయత్నం చేస్తున్నంతకాలం రోజుకురోజూ సంసారంలో "గాలి, వాన" పెరిగింది. ఇప్పుడు దృక్పథంమారగానే పది సంవత్సరాలబట్టీ ఇద్దదిమధ్యా జరుగుతూన్న "శీతలసంగ్రామం" ఎందుకు జరిగిందో అర్థమైంది. ప్రవాహం, తనరాస్తా మార్చేటప్పుడు, పాత రాస్తాగుండా నీరుపోనివ్వదు సరికదా ఇసక, రాళ్ళు, మేటపారేస్తుంది. మోహన్‌తో కాపరానికి వచ్చిన మొదటిరోజుల దగ్గరనుంచీ, మళ్ళా ఆలోచించడం ("రెవ్యూ") మొదలు పెట్టింది. నిర్దుష్టమైన ' ఆత్మవిమర్శలో స్వర్గీయానందం పొందనారంభించింది కాపరానికొచ్చిన మొదటి రోజులు...

మొదటిసారిగా అంట్లుతోమడంవల్ల బొబ్బలెక్కిన చేతుల్ని "ఎంతకందిపోయాయో నీ చేతులు"అంటూ ముద్దుపెట్టుకున్నాడు మోహన్. "సాయంకాలం ఆఫీసునుంచివచ్చాక నేనుకూడా సాయంచేస్తాను. అందాకా మరితోమకు" అన్నాడు చిరునవ్వుముఖంతో. "కాపదానికి రెండురూపాయలు ఇవ్వలేరు ఇంకా అంట్లు తోముతారు!" అంటూ మూతివిరిచి, ఆఘాయిత్యంగా అన్నీతోమిపారేసింది. చలోక్తిగా అన్నాడు "శాంతా! రెండురూపాయలంటే, తాసీల్‌దారుగారమ్మాయికి గొప్పకాదు కాని, ముప్పైరూపాయలు తెచ్చుకునే పేదవాడికి చాలా ఎక్కువ" అని.

"పోనీ మీరివ్వొద్దులెండి, నే నెక్కణ్ణుంచో ఇస్తా" అని చెప్పేసరికి మోహన్‌కి చిర్రెత్తింది.

"నువ్వెక్కణ్ణుంచి తెస్తావు?" అని గదమాయించాడు.

"నాకు మా నాన్నగారిచ్చారు"అని గుణిసింది.

"చూడు శాంతా, ఇవాళ మీ నాన్నగారిస్తారు. రేపో? నీక్కావల్సినవాటి కన్నిటికీ నాన్నగారిస్తూంటే, నాతో జీవించడంలో అర్థంయేముందీ?" అన్నదానిమీద చాలా వాదవివాదాలు జరిగాయి. అట్టే గుచ్చుకోకుండానే వెళ్ళిపోయిందొక ఏడాది. కొత్తవేడిలో.

శాంత ప్రతీవిషయంలోని "పైచేయి" కావాలన్న ఆత్రుత. ప్రతీవిషయంలోని అడక్కుండా తనఅభిప్రాయాన్ని వ్వడం, వాటినిపాటించినప్పుడు కొద్దో గొప్పో అలగడంకూడా చేస్తూ వచ్చింది. తగిన సంస్కారం ఉండి అహంభావంలేకుండా ఆలోచిస్తే, సాఫీగావే పోయిఉండేవి, వ్యవహారాలు. కాని, ఇంటిదగ్గర చేసిన ముద్దుతో, శాంత తనలో ఉన్న లోటుపాట్లు,"పర్యవసానం"ఏమిటి అని గాని, ఆలోచించడాని కలవాటుపడలేదు. మోహన్ శాంత విషయంలో, రోజుకురోజూ, ఏదన్నా అడ్డుతగిలేసరికి ముట్టుకుంటే చక్రంలా ముడుచుకుపోయే రోకలిబండమాదిరైనాడు.

ఇంకో ఏడాదికూడా వెళ్ళిందిలాగే కలగలుపుగా. ఒకరోజు భోజనానంతరం, మాటల్లో అడిగాడు శాంతని:

"ఏం శాంతా, మెట్రిలేషన్‌కి కట్టకూడదూ?" అని. శాంత పుట్టింటికి వెళ్ళివచ్చిన మొదటివారం. తండ్రి తాసీల్దారపటాన్న గవర్నమెంటువారేం జీతం ఇచ్చినా ఇవ్వకపోయినా, రెవిన్యూ ఇనస్పె

ష్టర్లు చేతుల్లో ఉన్నంతకాలం డబ్బుకి, హోదాకి, పలుకుబడికి లోపంలేదుగా! ఉండడంతోనే ఊరుకుంటే పోయేది. పెద్దచదువు చదివి క్లార్కుగా పాతుపడిపోయిన బావగారిమీదదాడిసాగించారు చెల్లెళ్లు, అన్నదమ్ములు.

"బావ గాంధీజీ ఔతాట్టే, అందుకని తన కొచ్చేదాంతోనే గడపాలంటాడు" అంది సుగుణ.

"బావ మేకపాలు తాగుతాడ్రా అంటే వేరు శనక పిక్కలు తింటాడ్రా" అని వెనకపదం పాడారు, కిట్టు, జగ్గు.

ఏదో నాకూ తెలుసునన్నట్లు తనూ ఒకపాడి వేసింది తల్లి.

"చాతకానివాళ్ళకి ఆదర్శాలు జాస్తీ. ధైర్యంగా నలుగురికిపెట్టాలి తాను తినాలి. అంతేకాని, చాదస్తంగా మోహనం ఒక్కడూ మడికట్టుకుంటే, లోకం బాగుపడిపోతుందీ?" అని సాగదీసింది. ఇలాంటి వెన్నో వినటాన్ని, శాంతకి, మోహన్ చేస్తూన్న పనంతా తప్పులాగ, తక్కిన వాళ్ళు చేస్తూన్నదే రైటులాగ కనబడ్డం ఆరంభించింది.

అన్నిటికంటే పెద్దచిక్కేమిటంటే, "శాంతా నాలుక్కుంచాల పాతబియ్యం బెడ్డింగులో పోస్తాను తీసుకెళ్ళరాదే? రేషనుబియ్యంతో చాలీ చాలక బాధపడకపోతే?" అనేసరికి అసహాయత్వంతో కళ్ళంట నీళ్ళు పర్యంతం తిరిగాయి శాంతకి.

"ఆ తీసుకెత్తే హోటల్లోసన్నాభోం చేస్తారు, లేకపోతే పస్తన్నా ఉంటారని," అందరితోపాటు శాంతకూడా మోహన్ని ఈసడించింది. మెట్రిక్యులేషన్కి చదువమనేసరికల్లా మొహంముడుచుకుని, "ఎందుకూ?" అంది.

"ఉత్తనే, కొంత ఊసుపోతుంది" అన్నాడు ఏమీ అనడానికి తోచక.

"ఇప్పుడు తీరుబాటెక్కువై పోతున్నది కామోసు నాకు" అనికొంచంసేపూరుకొని, "అంట్ల దానికి రెండురూపాయలు ఇవ్వలేం, పుస్తకాలకి, పరీక్షకి, ఎక్కడనుంచొస్తుందో డబ్బు?" అని చల్లగా దెప్పిపొడిచింది.

"తేగలను కాబట్టే చెప్పేనుశాంతా, మా సిరస్తాదారుగారి అమ్మాయిని ఆంధ్రా మెట్రిక్కి కట్టిస్తే 200 రూపాయలు ఇస్తానన్నాడు. మేనరికం మొగుడని ఇన్నాళ్లూ ఊరుకున్నారు. ఇప్పుడు మెట్రిక్ పాసైతేకాని పెళ్ళిచేసుకోనంటున్నాట్ట. ఇంతకుముందు మూడోఫారంవరకూ చదివింది... అందుకని ఈ ప్రసంగమంతాను. నువ్వుకూడా పరీక్షకుర్చుంటే, ఒకటేపాటతో ఇద్దరూ పాసౌతారు" అని తన స్కీమంతా వెళ్లబుచ్చాడు.

"ఆ ఇప్పుడు నాకెందుకులెండి. చదువుకోకపోతే పెళ్ళికాదా? చదువుకుని ఏం ఉద్యోగం చెయ్యాలా? ఊళ్ళేలా? పొయ్యిలోంచి పెడలోకి, పెడలోంచి పొయ్యిలోకి; ఈ చాకలి పద్దు చదువు చాల్లెండి" అని లెక్చరిచ్చింది.

"అలా కాదు శాంతా, ఈ ఒక్కటీ నేచెప్పినట్టు వినమూ," అని బతిమాలాడు. "ప్రతివ్యక్తీ ప్రత్యేక జీవితానికి అర్హుడు కావాలంటే, విజ్ఞానం కావాలి. విద్యలేని విజ్ఞానం నిత్యజీవితములో చూడం కాబట్టి, విద్యనుందలవర్చుకోవాలి. జీవితానికి ఏదో ఒక ఆదర్శం ఉండాలి. ప్రపంచం గురించి తెలుసుకొనే సమగ్రత ఉండాలి. పంచకి అంచు ఎల్లాగో జీవితానికి ఆదర్శం అలాంటిది. అంచులేనిపంచ, సైనుపంచ. ఆదర్శంలేని జీవితం వెధవజీవితం" అని ఉద్రేకంగా మాట్లాడేసరికల్లా,

"తిట్టండి తిట్టండి. నాదే వెధవజీవితం నాదే" నంటూ బోళబోళ ఏడ్చేసింది. మళ్ళీ చదువు ఊసెత్తలేదు మోహన్.

సాయంకాలం ఆఫీసునుంచి వచ్చాక, 50 రూపాయిలు శాంత చేతికిచ్చి, "ఇదిగో నీ ఏభై. ఇవాళనుంచి ట్యూషన్ ప్రారంభం. నీ యిష్టమొచ్చింది కొనుక్కో, రేపు నీ పుట్టిన దినం కూడాను" అన్నాడు నవ్వుతూ. చిరునవ్వుకిబదులు మొహం ముడిచిపెట్టుకుని "ఏభై రూపాయిలకేమొస్తుంది? అరతులం బంగారంకూడా రాదు." అనేసరికల్లా మోహన్ నివ్వెరపోయాడు.

నాలుగునెలలు ఎవరి ఆలోచనల్లో వాళ్లుండటాన్ని మోహన్కి తీరుబాటులేమి, సాదాగా గడిచిపోయాయి.

"సిరస్తాదారమ్మాయి చాలా చురుకైందిసుమా శాంతా. ఇలాచదివిందంటే, ఏడాదిలోనే పూర్తి చేయగల్దు" అన్నాడు ఉత్సాహంతో అమాయికంగా, పడుతున్నశ్రమ ఫలిస్తుందనేఆనందంతో.

శాంతకి ఎక్కడలేని ఈర్ష్య వచ్చింది. "ఇంట్లో ఉన్నవాళ్లకంటే ఎవరన్నా తెలివైనవాళ్ళే ఔతారు. పొరుగింటి పుల్లకూర రుచి, తావలచింది రంభ, తామునిగింది గంగ" అని తనకు వచ్చిన రెండు సామెతలు ఏకరువు పెట్టింది. మోహన్ మళ్ళా సిరాస్తాదారుగారమ్మాయి వూసెత్తలేదు. నాలుగురోజులు గడిచిందగ్గరనుంచీ, తలనొప్పని మూలగడం, ట్యూషన్‌కి పోవద్దనడం, పిచికమీద పిల్లిమీద పెట్టి సిరస్తాదారు గారమ్మాయికీ మోహన్‌కీ మధ్య లేనిపోని సంబంధాలు కల్పించి, ఏమేమోఅనడం మొదలుపెట్టింది. ప్రతీ మాటూ, "నేనేమైపోయినాసరే, సాయంకాలం దాని మొహం చూడకుండా ఉండలేరు వెళ్ళండి" అని సాగదీసుకునేది. శాంత అనుకోకుండా కల్పించిన సంబంధం, లోకులు కూడా పురస్కరించుకుని, సిరస్తాదారుగారితో మోహన్‌ని మానిపించకపోతే, గ్రంథం చాలాదూరం పోతుందని సలహా యిచ్చారు. మోహన్‌ని క్షమాపణ వేడుకుంటూ "లోకానికి జడిసి మానిపిస్తున్నానని 150 రూపాయలు ఇచ్చి నమస్కరించాడు సిరస్తాదారు. ప్రమాదవశాన్న ఆదేరోజు శాంత కూడా సినీమాకి తీసుకెళ్ళమని బలవంతం చేసింది. "ఎల్లాగా వేగిరం వచ్చేశారుకదా, సినీమాకెల్దాం పదండి" అని. ఇది శాంతచేసిన తతంగమేనని మోహన్ అనుమానంతో శాంత నసహ్యించుకున్నాడు.

ఈ పునాదిమీద కట్టబడింది శాంత సంసారం. శాంత దృక్పథం మారి మోహన్ స్థానంలో నిలబడి శాంతని చూడగల్గింది. చూడగానే జ్ఞానోదయమైంది "అసలు ఇన్నాళ్లూ చెయ్యిచేసుకోకుండా ఎలా ఉండగలిగాడు?" అని సందేహం కలిగింది. ఇదే ముందు జరిగుంటే ఇంత బాధ లేకపోదేమో అనుకుంది కూడా.

ఈ పరివర్తనతో ముందెల్లా చెయ్యాలో ఆలోచించడం, మొదలుపెట్టింది. మోహన్ కేంపు నుంచి రాగానే కాళ్ళమీదపడి "పాతవన్నీ మరచిపొమ్మని, ఇటుపైన మరెప్పుడూ అలాంటివి చెయ్యనని" ప్రార్థిస్తాననుకుంది. ఈ ఆలోచన రాగానే "మోహన్ ఎప్పుడింటికి వస్తాడు, ఎంత వేగిరం పాపమిముక్తురాలౌతాను" అని తహతహలాడింది. రోజల్లా ఎలాగో గడిపింది. చీకటి పడుతూన్న కొద్దీ, ధైర్యంతగ్గడం మొదలుపెట్టింది. "తీరా మోహన్ ఎదురుపడ్డాక నాటకంలోలాగ కాళ్ళమీద పడ్డం అపీ చెయ్యగలనా, యింతకీ ఇద్దరంచేసిన తప్పులు" అని మళ్ళా వెనకమార్గం పట్టింది మనస్సు. కాని వెంటనే అనిపించింది. "ఇలా ఆలస్యంచేస్తే పదేళ్ళ జీవితం వ్యర్థమైంది. మిగతాదికూడా నాశనమౌతుందని..." ఇంకా వాదన పూర్తికాలేదు. కారొచ్చి ఆగింది ఇంటి ముందు. నలుగురు మనుష్యులు మోహన్‌ని ఎత్తి తీసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టారు.

"చాలా అదృష్టం. అమాంతంగా బస్సు మీద నుంచి పోవాల్సింది. కాని ప్రమాదం తప్పింది. దెబ్బలుమాత్రం తగిలాయి" అని జరిగిన ప్రమాదాన్ని చల్లగా చెప్పారు. తలనిండా కట్లు రక్తం మరకలూ చూచేసరికల్లా, మోహన్ దూరంగా ఉన్నప్పుడు ఎంత నిరాడంబరంగా క్షమాపణ కోరదామనుకుందో అంతకన్నా ఎక్కువగా అతని పాదాలు పట్టుకొని కన్నీళ్ళతో అభిషేకం చేస్తూక్షమించమని ప్రార్థించగలిగింది మనస్సులో. పరివర్తనని మోహన్ కూడాగుర్తించి దగ్గరకు తీసుకుని శాంత తల నిమిరాడు.

---

రాజ్యాంగం అన్నది ప్రభుత్వం తయారుచేసిన అనుబంధం కాదు: రాజ్యాంగం నుండే ప్రభుత్వం అనబడేది ఉద్భవిస్తుంది. ప్రభుత్వ శాసనఫలితంగా రాజ్యాంగాలు ఏర్పడవు: ప్రజానీకానికి అత్యంత సహజంగా ఉన్న హక్కుల ఫలితమే రాజ్యాంగం—థామస్ పైన్.

* * *

ప్రభుత్వం అనే సంస్థ ఎలా జనించిందనే పరిశోధనలో నువ్వు ఏ సిద్ధాంతాలను అనుసరించినా, కట్టకడపట నువ్వు విశ్వజనీనమైన కొన్ని నైతికసూత్రాలను ముఖాముఖి ఎదుర్కొనక తప్పదు.—వాన్ డైక్.